క్లుప్తంగా

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం



టేకిశెట్టిపాలెంలో సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం టేకిశెట్టిపాలెంలో రూ.20 లక్షలతో నిర్మించిన వివిధ సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ పోతు దేవీదుర్గ, పెదపాటి నాగలక్ష్మి, గెద్దం అమ్ములు, పోతు తాతయ్యనాయుడు, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

కృష్ణుడు దేవాధిదేవుడు

అయినవిల్లి: కృష్ణతత్వం మహోన్నతమైందని, ఆయన దేవాధిదేవుడని అయినవిల్లి మండలం నల్లచెరువులోని అంత్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకులు ప్రభుజీ శ్రీనివాస్‌దాస్ అన్నారు. ఆదివారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ శ్రీకృష్ణుని తత్వంపై బోధనలు చేశారు. భగవత్ గీతా సారాంశాన్ని వివరించారు. శ్రీకృష్ణుడు అణువు అణువునా వ్యాపించి ఉండి సమస్త లోకాలను రక్షిస్తున్నాడన్నారు. ఆయనే విశ్వాంత్రయామి అని చెప్పారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గణేశుల సత్తియ్యనాయుడు తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విజేతలతో టోనీ పున్నయ్య తదితరులు

మలికిపురం: జాతీయ స్థాయిలో ఈ రోజు జరిగిన నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో లక్కవరం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జపాన్‌కు చెందిన డో హయాసా, హాషితో, రియూ కాయ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ఈ గ్రామానికి చెందిన ఎస్.అభిజ్ఞాన్స్, ఎ.అవినాష్, ఎస్.సుభాషిణి, ఎ.మోహన్ దీప్తి, జి.ప్రజ్ఞానస్ విద్యార్థులకు బెస్ట్ ప్రదర్శన గాను ఎల్లో బెల్ట్, ప్రశంసా పత్రాలను ఆ సంస్థ చీఫ్ టోనీ పున్నయ్య లక్కవరంలో అందజేశారు. ప్రిన్సిపాల్ కళ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అరటి పంటపై పందుల దాడి

అంబాజీపేట: లక్షలు వెచ్చించి నాటిన అరటి పంటను పందులు స్వైరవిహారం చేసి నాశనం చేశాయి. అంబాజీపేట, మాచవరం గ్రామాల్లో పందులు విచ్చలవిడిగా సంచరించి నష్టాల పాలు చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సేవేటి వెంకట్రావుకు చెందిన నాలుగెకరాలలో అరటి తోటను రూ.లక్షతో నాటారు. అరటి దుంపలతో సహా పందులు పెకిలించి నష్టపరిచాయని వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే ఈ రెండు గ్రామాల్లో చేతికందొచ్చిన అరటి పంటను నాశనం చేయడంతో రూ.లక్షలు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విచ్చలవిడిగా సంచరించి అరటి పంటను నాశనం చేస్తున్న పందులను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

అంకితభావంతో బాధ్యతలు నిర్వహిస్తే గుర్తింపు



తహసీల్దార్ ముక్తేశ్వరరావును సత్కరిస్తున్న వీఆర్వోలు, వీఆర్ఏలు

రాజోలు: ప్రజలకు అంకితభావంతో బాధ్యతలు నిర్వహిస్తే గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు అన్నారు. ఆదివారం తహసీల్దారు ముక్తేశ్వరరావు దంపతులను కార్యాలయ సిబ్బంది, వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రాజోలు నుంచి ఇటీవల జరిగిన బదిలీల్లో పశ్చిమగోదావరి జిల్లా తణుకు బదిలీ అయ్యారు.

కృష్ణకుమార్‌కు అర్చక వైభవరత్న పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కృష్ణకుమార్

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ క్షేత్రపాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ కృష్ణకుమార్‌కు అర్చక వైభవ రత్న, సువర్ణ కంకణం, ఉగాది పురస్కారం లభించినట్లు ఆయన తెలిపారు. వేంకటేశ్వర యూనివర్సిటీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అర్చక వైభవ రత్న, సువర్ణ కంకణం, ఉగాది పురస్కారం అందించినట్లు తెలిపారు.

మోతాదు మించితే నష్టమే..

- అధిక రసాయనాల వినియోగం అనర్థం
- వ్యవసాయాధికారుల హెచ్చరిక



మొసలపల్లిలో పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

అంబాజీపేట: విత్తనాలు చల్లింది మొదలు రైతులు మొత్తం ఎరువులు పురుగు మందులతోనే సహవాసం చేస్తున్నారు. సస్యరక్షణకు అవసరమైన మోతాదులో, వ్యవసాయ నిపుణుల సూచన మేరకు ఎరువులు, పురుగుమందుల వినియోగంతో రైతులకు అనవసర వ్యయాన్ని తగ్గిస్తుంది. రైతులు నిపుణుల సూచనలు పక్కన పెట్టి వేలం వెర్రిగా రసాయనాలు వినియోగించి అనవసర వ్యయంతో నష్టపోతున్నారు. దీనివల్ల చీడపీడల బెడద మరింత పెరిగిపోవడమే కాక ఎక్కువగా ఎరువులు, పురుగుమందుల వాడకం వల్ల ఏ మాత్రం ఫలితం ఉండదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రైతులు ఏమాత్రం వరిపైరు తేడాగా కనిపించినా, ఒకటి అరా దోమలు కనిపించిన వెంటనే రసాయనాలు ఆశ్రయిస్తున్నారు. వరినాటు వేసే వారం తిరగకుండానే అప్పుడే ఎరువుల వాడకం ముమ్మరమైంది. పి.గన్నవరం నియోజకవర్గంలో 22,384, కొత్తపేట నియోజకవర్గంలో 18,322, రాజోలు నియోజకవర్గంలో 9,387 వేల ఎకరాల్లో విస్తీర్ణంలో రబీ వరి సాగు చేస్తుండగా ఇప్పటి వరకూ 90 శాతం మేర వరినాట్లు పూర్తయ్యాయి. నాట్లు వేసిన రైతులు వారం తిరగకుండానే మొదటి దఫా ఎరువులు వేయడం పూర్తి చేసినట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. సాగులో కొద్దిపాటి మెళకువలు పాటిస్తూ, రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులు పొలంబడి ద్వారా అందిస్తున్న సూచనలు, సలహాలు పాటిస్తే రైతులకు అనవసర వ్యయం తగ్గడంతో పాటు, అధిక దిగుబడులు సాధించవచ్చని అధికారులు చెబుతున్నారు.

సూచనలు ఇలా...

ఒక హెక్టారు పొలానికి 78 కిలోల నత్రజని ఎరువును మూడు భాగాలుగా చేసి ఒక భాగం దమ్ములో, మరో భాగం నాటిన రెండు వారాల తర్వాత, మూడో భాగం నెల రోజులు తర్వాత వేసుకోవాలి. కానీ రైతులు నాటిన వారం రోజులకే నత్రజని ఎరువు వేస్తున్నారు. దీనిని వేప పిండితో కలిపి వేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. భాస్వరం, డీఏపీ లేదా కాంప్లెక్స్ రూపంలో ఒకే దఫాగా, వేసుకోవాలి. జింక్ లోపం ఉన్నట్లు గుర్తిస్తే ఒక గ్రాము జింక్ సల్ఫేట్‌ను ఒక లీటరు నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

> **సేంద్రియ ఎరువులు వినియోగించాలి**
>
> 
>
> రసాయన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులు వినియోగించడం వల్ల భూసార పరిరక్షణతో పాటు, నాణ్యమైన ఉత్పత్తులు సాధించే అవకాశం ఉంది. అధిక ఎరువులు వినియోగించడం వల్ల భూమి చౌడు బారే అవకాశం ఉంది.
>
> – సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఏఓ, అంబాజీపేట

జగనన్న ప్రభుత్వంలోనే మహిళలకు ఆత్మగౌరవం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- కొత్తపేటలో నాలుగో విడత 'వైఎస్సార్ ఆసరా'



కొత్తపేటలో డ్వాక్రా సంఘాలకు నమూనా చెక్కు అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: దేశానికి స్వాతంత్య్రం వచ్చాక రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వివిధ సంక్షేమ, శాశ్వత పథకాల ద్వారా మహిళల ఆత్మగౌరవం నిలిపి, ఆర్థిక స్వాతంత్య్రం కల్పించిందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. డ్వాక్రా రుణమాఫీకి సంబంధించి కొత్తపేట, పలివెల, మందపల్లి గ్రామాల 671 డ్వాక్రా గ్రూపులకు సుమారు రూ.5.44 కోట్లు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత పంపిణీని ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఒక పండగ వాతావరణంలో నిర్వహించారు. ఎంపీపీ మార్గన గంగాధరరావు అధ్యక్షతన జరిగిన సభలో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఏ రాష్ట్రంలో లేని విధంగా ఈ రాష్ట్రంలో మహిళలకు సీఎం జగన్ ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారన్నారు. 2019 ఎన్నికల ముందు జగన్ మాటిచ్చిన ప్రకారం రాష్ట్రంలో 79 లక్షల మంది డ్వాక్రా మహిళలకు ఏడాదికి రూ.6,392.75 కోట్లు చొప్పున నాలుగు విడతల్లో రూ.25,571 కోట్ల రుణమాఫీ చేసి తిరిగి మహిళల ఖాతాలకు జమచేశారన్నారు. అత్యధికంగా 6,333 డ్వాక్రా సంఘాలకు రూ.219.60 కోట్ల రుణమాఫీతో జిల్లా వ్యాప్తంగా కొత్తపేట నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉందన్నారు. అలాగే ఏ నియోజకవర్గంలో ఇవ్వని విధంగా 17,685 మంది మహిళల పేరున ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చామన్నారు. ఇలా దాదాపు ప్రతి పథకం మహిళల పేరున అమలు చేసిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మీ కోసం అనేక సంక్షేమ పథకాలకు సంబంధించి 126 సార్లు బటన్స్ నొక్కి ఆర్థిక ప్రయోజనం కల్పించిన జగనన్నను వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎం చేయడానికి ఫ్యాన్ గుర్తుపై నొక్కాలని జగ్గిరెడ్డి మహిళలను కోరారు. అనంతరం 671 డ్వాక్రా గ్రూపులకు సుమారు రూ 5.44 కోట్లు నమూనా చెక్కును జగ్గిరెడ్డి మహిళలకు అందజేశారు. ముందుగా ఆ ప్రాంగణం ముఖద్వారం నుంచీ జగ్గిరెడ్డిపై డ్వాక్రా మహిళలు పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. మహిళలకు ప్రోత్సాహకంగా సభకు వచ్చిన మహిళల్లో 100 మందికి లక్కీ డీప్ ద్వారా రైస్ కుక్కర్లు అందజేశారు. తన సోదరీమణులు శైలజ, నీరజలతో లక్కీ డీప్ తీయించి వారి చేతుల మీదుగా మహిళలకు కుక్కర్లు అందించారు. అనంతరం మహిళలందరికీ విందు ఏర్పాటు చేసి మ్మెల్యే జగ్గిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులతో కలిసి వడ్డించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, ఏఎంసీ చైర్‌పర్సన్ రెడ్డి రవీదేవి, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, వైస్ ఎంపీపీ దంగేటి వెంకటనాగమణి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్‌లు రెడ్డి చంటి, దూనబోయిన నవదీప, ఎంపీటీసీలు పేపకాయల బ్రహ్మానందం, దూళి సూరిబాబు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎంపిక

సఖినేటిపల్లి: మోరి మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఎస్టీయూ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్టీయూ సంఘ మండల నూతన కార్యవర్గం ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. మండల గౌరవ అధ్యక్షుడిగా కడలి వెంకట నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా గుబ్బల శ్రీనివాసు, ప్రధాన కార్యదర్శిగా ఉండపల్లి గిరిబాబులను ఎన్నుకున్నారు. అలాగే మండల మహిళా అధ్యక్షురాలుగా ఎండీ బషీరా బేగంను ఎన్నుకున్నారు. వీరితో పాటు ఆర్థిక కార్యదర్శిగా గేదెల వీవీ కృష్ణ ప్రసాద్, ఇతర విభాగాల కన్వీనర్లుగా కంచి నాగరాజు, జెట్టి వీర్రాజులను ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్లుగా నరహరశెట్టి సత్యనారాయణ తదితరులను ఎన్నుకున్నారు.

అద్వానీకి భారతరత్నపై హర్షం

కొత్తపేట: దేశంలో కీలకనేత, బీజేపీ సహ వ్యవస్థాపకుడు ఎల్‌కే అద్వానీకి దేశ అత్యున్నత పురస్కారం 'భారతరత్న' లభించడంపై రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం హర్షం వ్యక్తం చేశారు. అద్వానీ దేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయనకు అత్యున్నత పురస్కారం దక్కడం దేశ వ్యాప్తంగా బీజేపీ శ్రేణులకే కాక అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న ఆయన అభిమానులకు, పౌరులకు ఆనందకర విషయమన్నారు.

గ్రామం వెలుపల నుంచి రైల్వే లైన్ వేయాలి

మలికిపురం: మండలంలోని గుడిమెళ్లంక గ్రామం మధ్య నుంచి కాకుండా వెలుపల నుంచి రైల్వే లైన్ వేయాలని గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పెన్మెత్స రంగరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన గ్రామంలో జరిగిన గ్రామస్తుల సమావేశంలో మాట్లాడుతూ ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్ సెల్‌కు గ్రామస్తులంతా వెళ్లి విజ్ఞప్తి చేయనున్నట్లు వివరించారు. గ్రామం నడిబొడ్డున పురాతన ఆలయాలు, తాగునీటి చెరువు, పేదల నివాసాలు పాడవుతాయని ఈ అంశంలో కలెక్టర్ చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పీపుల్స్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలి

అంబాజీపేట: జై భారత్ నేషనల్ పార్టీ ప్రవేశపెట్టిన పీపుల్స్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ అధ్యక్షుడు జెడీ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఇరుసుమండలో ఇరుసుమండలో కోనసీమ ఆహార నిధి చైర్మన్ వీరంశెట్టి సతీష్‌కు, అతని కుటుంబ సభ్యులకు బ్రోచర్లను ఆదివారం అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

అంబాజీపేట: మాచవరం పక్షులరావిచెట్టుకు చెందిన ఓ వివాహిత అమలాపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గుడివాడకు చెందిన గుత్తుల జోత్స్న సత్యశ్రీ (18) తన పుట్టింటికి సంక్రాంతి పండగకు వచ్చిందన్నారు. గత నెల 27వ తేదీ రాత్రి ఇంటిలో ఉరివేసుకోవడంతో స్థానికులు, బంధువులు స్పందించి అమలాపురం ఆస్పత్రికి తరలించారన్నారు. మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారన్నారు. అక్కడి నుంచి అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తుండగా మృతి చెందిందన్నారు. మృతురాలి తల్లి మామిడిశెట్టి నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

రజక సంఘం నేతలకు సన్మానం



ఆదుర్రులో రజక సంఘం ప్రతినిధులను సన్మానిస్తున్న స్థానికులు

మామిడికుదురు: ఆదుర్రు గ్రామంలో సీతారామ రజక సంఘం సమావేశం ఆదివారం జరిగింది. బళ్ల పూజ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో రజక సంఘం ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర రజక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ బొర్రాపాలెపు సత్యనారాయణ, బీజేపీ జిల్లా కార్యదర్శి పసుపులేటి మహలక్ష్మీరావు, బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి కోటిపల్లి సాయిబాబు, జనసేన మండల కార్యదర్శి కాట్రేనిపాడు నాగేంద్రలతో పాటు పలువురికి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. సమావేశంలో ఆదుర్తి జానకీ రామయ్య, కోటిపల్లి శ్రీనివాస్, రామేశ్వరపు సుబ్రహ్మణ్యం, కందివలస అప్పారావు, మొగలికుదురు వీరరాఘువులు, ఆదుర్రు కొండయ్య పాల్గొన్నారు.

పొల్లమ్మ ఆలయ కరపత్రాల ఆవిష్కరణ



ఈదరాడలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రథసారథి శ్రీరామ్మూర్తి

మామిడికుదురు: ఈదరాడ గ్రామ దేవత పొల్లమ్మ ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయం పునః నిర్మాణ సారథి యెరుబండి శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు అమ్మవారి ఆలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని శ్రీరామ్మూర్తి తెలిపారు. 20వ తేదీ మంగళవారం ఉదయం 10.34 గంటలకు పునః ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 21వ తేదీ అమ్మవారి ఊరేగింపు, గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 22వ తేదీ గురువారం ఉదయం 11.53 గంటలకు ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతుందని చెప్పారు. 23వ తేదీ సామూహిక కుంకుమార్చన ఏర్పాటు చేశామన్నారు. కరపత్రాల ఆవిష్కరణ అనంతరం అమలాపురం ఎంపీ చింతా అనురాధ, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌కు కరపత్రాలను అందించారు. పునః ప్రతిష్ఠా మహోత్సవాలకు హాజరు కావాలని కోరారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పరిశీలన



ముంగండ సచివాలయంలో జగనన్న లేఅవుట్ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ

పి.గన్నవరం: జగనన్న లేఅవుట్ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కొత్తపేట ఆర్డీఓ డీవీవీ సత్యనారాయణ ఆదేశించారు. ముంగండ గ్రామ సచివాలయంలో ఆదివారం జరిగిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బి.గోపాలకృష్ణ, వీఆర్వోలు దొరబాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పి.గన్నవరం గ్రామ సచివాలయంలో ఆదివారం జగనన్న లేఅవుట్ ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరిగింది. వీఆర్వో తోట శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కుంపట్ల పోలరాజు, సచివాలయ సిబ్బంది రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించారు.

పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం

రావులపాలెం: మండలంలోని ఈతకోటలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. రూ.15 లక్షలతో నూతనంగా నిర్మించిన 'బీసీ గౌడ కమ్యూనిటీ హాల్'ను ప్రారంభించి గతంలో గౌడన్నలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామన్నారు. అలాగే గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయం-1 నూతన భవనం, రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయం-2 భవనాన్ని రూ.23.94 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, ఎంపీటీసీ హరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు వత్సవాయి కృష్ణంరాజు, చింతా రావు, కాశి కృష్ణ, కార్యదర్శి మూర్తి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి సాయం



బాధితుడి తల్లికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి తలకు శస్త్రచికిత్స కోసం సాయం కోరిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామానికి చెందిన దొమ్మేటి వెంకట సాయికృష్ణ రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తలకి తీవ్ర గాయాలయ్యాయి. తలకి ఒకసారి సర్జరీ చేశారు. ఇప్పుడు ఇంకో సర్జరీ చేయాల్సి ఉంది. సాయి కృష్ణకి తండ్రి లేడు. పేదరికంతో బాధపడుతున్న వీరు కాశీ అన్నపూర్ణదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో సాయికృష్ణ తల్లి నాగలక్ష్మికి రూ.15 వేల నగదుసాయం అందజేసినట్టు ఆ సంస్థ సభ్యులు తెలిపారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ ఉపాధ్యక్షుడి మృతి



అడబాల గంగరాజు(ఫైల్)

మలికిపురం: లక్కవరం చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడిగా పనిచేసిన అడబాల గంగరాజు (84) మృతి చెందారు. ఆయన మృతికి సంతాప సూచకంగా ఆదివారం లక్కవరంలో వర్తకులు షాపులు మూసి వేసి బంద్ పాటించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాప సభలో చాంబర్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణరాజు మాట్లాడుతూ ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో యాతం కృష్ణ, పలచోళ్ళ రాంబాబు, శృంగారపు పద్మనాభం, పి.నారాయణరావు, బి.రవి, సీహెచ్ రాము, కడియాల సూర్య ప్రకాశరావు, మండేల రామ్మూర్తి, బోనం బాబ్జి పాల్గొన్నారు.

గ్రామ పరిపాలనకు దిక్సూచి సచివాలయ వ్యవస్థ



పాదలాడ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: గ్రామ పరిపాలనకు దిక్సూచిగా సచివాలయ వ్యవస్థ నిలిచిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం పాదలాడలో నూతనంగా రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. సర్పంచ్ కడలి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ గ్రామ పరిపాలన మరింత చేరువగా ఉండేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థకు రూపకల్పన చేశారన్నారు. దీని ద్వారా గ్రామ స్థాయిలోనే అనేక సేవలు అందిస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు వంటివి సచివాలయానికి అనుసంధానంగా ఏర్పాటు చేశారన్నారు. ఎంపీపీ కేతా శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, గ్రామశాఖ అధ్యక్షుడు లిఖితపూడి బుజ్జి, నాయకులు కంబాల చంద్రరావు, దొమ్మేటి సోమరాజు, మాజీ ఎంపీటీసీ గెద్దం సురేష్, రాజోలు, సోంపల్లి సర్పంచ్‌లు రేవు జ్యోతి, కట్టా శ్రీనివాసరావు, ఎంపీటీసీలు శిరిగినీడి వెంకటేశ్వరరావు, చెల్లింగి లక్ష్మిఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ వెళ్లి పింఛన్ అందజేత



సత్యవతికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ దీపిక

అంబాజీపేట: అనారోగ్యం కారణంగా కాకినాడలో కుమారుడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న వాకలగరువుకు చెందిన పెనుపోతు సత్యవతి వద్దకు వలంటీర్ తవిటికి దీపిక ఆదివారం వెళ్లి వృద్ధాప్య పింఛన్ పంపిణీ చేశారు. ప్రతి నెలా లబ్దిదారులకు పింఛన్ అందించాలన్న ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా సత్యవతి చికిత్స పొందుతున్నారని తెలుసుకుని వలంటీర్ దీపిక ఆమె వద్దకు వెళ్లి పింఛన్ పంపిణీ చేసింది. వలంటీర్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న టీడీపీ

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ధ్వజం
- అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం



వాడపాలెంలో మంచినీటి పథకానికి శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక పెదగూళ్లపాలెంలో రూ.10 లక్షలతో నిర్మించిన రామాలయం షెడ్డును ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. వివిధ పథకాల నిధులు రూ.1.09 కోట్లతో కొత్తపేట-ఈతకోట ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి చినగూళ్లపాలెం మీదుగా పలివెల వెళ్లే పీఆర్ సీసీ, బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. మండలంలోని వాడపాలెం పెదపేటలో జేజేఎం రూ.96.80 లక్షలతో నిర్మించే 40 వేల లీటర్ల రక్షిత మంచినీటి పథకానికి శంకుస్థాపన, రూ.12 లక్షలతో నిర్మించిన ఎంపీపీ పాఠశాల భవనం ప్రారంభోత్సవం చేశారు. ఆయా గ్రామాల్లో విప్ జగ్గిరెడ్డి మాట్లాడుతూ చినగూళ్లపాలెం రోడ్డుకు గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలు, ఉపాధి పథకం నిధులు రూ.10 లక్షలు, పాత టెండర్ నిధులు రూ.4.50 కోట్లలో రూ.79 లక్షలు మొత్తం రూ.1.09 కోట్లతో గ్రామం వెలుపల బీటీ, గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి టెండర్ పూర్తి చేయించి. తాము శంకుస్థాపనకు సిద్ధం కాగా స్థానిక పంచాయతీ తరఫున టీడీపీ వారు ఏ విధమైన తీర్మానం లేకుండా, శాంక్షన్ లేకుండా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 లక్షలతో రోడ్డు వేస్తున్నట్టు కొబ్బరి కాయలు కొట్టడం విడ్డూరంగా ఉందన్నారు. రూ.1.09 కోట్లతో రోడ్డు పూర్తవుతుందా? రూ.2 లక్షలతో పూర్తవుతుందా? స్థానికులు గ్రహించాలని, వారు చేయాలా, మేము చేయాలా తేల్చుకోవాలని గ్రామస్తులను ప్రశ్నించారు. వారు మొత్తం రోడ్డు వేస్తామంటే తమకేమీ అభ్యంతరం లేదని, అభివృద్ధికి తాము సహకరిస్తామన్నారు. నియోజకవర్గంలో ఎంతోకాలంగా అపరిష్కృతంగా మిగిలిపోయిన అనేక పనులను తాము ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిధులు మంజూరు చేయించి, పనులు చేపట్టే ముందు టీడీపీ నాయకులు ఉనికి చాటుకునేందుకు ఆందోళనలు చేసి, ఆ క్రెడిట్ తమదేనని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేయడం హాస్యాస్పదమన్నారు. బీసీలకు ముఖ్యంగా శెట్టిబలిజ కులానికి అన్నింటా ప్రాధాన్యం ఇచ్చింది నాటి సీఎం వైఎస్సార్, నేటి సీఎం జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. నియోజకవర్గంలో కూడా గతంలో ఎవరూ ఇవ్వని విధంగా కొత్తపేట ఏఎంసీతో పాటు ఆలమూరు ఏఎంసీ చైర్మన్ పదవులను శెట్టిబలిజ వర్గానికి కట్టబెట్టామన్నారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ రెడ్డి రవీదేవి, వైస్ ఎంపీపీ దంగేటి వెంకటనాగమణి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీలు నేలపూడి భీమరాజు, పేపకాయల బ్రహ్మానందం, మండల ఏపీబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మట్టా బాబ్జి తదితరులు పాల్గొన్నారు.